# బీఆర్ఎస్ కార్మికుల పక్షపాతి

- బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి సతీమణి నీలిమా
- మద్దతు ప్రకటించిన కార్మిక సంఘాలు



చేర్యాలలో కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న పల్లా నీలిమా

చేర్యాల, నవంబర్ 27: సమాజంలోని అన్ని రంగాలకు చెందిన కార్మికులను ఆదుకున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని బీఆర్ఎస్ జనగామ నియోజకవర్గ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి సతీమణి పల్లా నీలిమా అన్నారు. బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబుయాదవ్‌కు ఇటీవల శ్రమశక్తి అవార్డు రావడంతో పట్టణంలోని పంక్షన్ హాలులో సోమవారం ఆయనకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పల్లా నీలిమా మాట్లాడుతూ రాంబాబుయాదవ్ కార్మికుల సంక్షేమానికి అన్ని విధాలుగా పాటుపడుతుండడంతో ఆయనకు శ్రమ శక్తి అవార్డు లభించిందన్నారు. సీఎం కేసీఆర్ కార్మికుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు తీసుకువచ్చి వాటిని పటిష్టంగా అమలు చేసినట్లు తెలిపారు. జనగామ నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమంతోపాటు అభివృద్ధి కోసం కృషి చేసేందుకు ముందుకు వచ్చిన పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కార్మికులు ఆదరించి ఆశీర్వదించాలన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే సత్తా ఉన్న నాయకుడు పల్లా మాత్రమేనన్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కార్మికుల సంక్షేమానికి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి వాటిని పటిష్టంగా అమలు చేశారని, బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి ముస్త్యాల గణేశ్, మండల అధ్యక్ష, కార్యదర్శులు కంతుల రాజు, ఎక్కలదేవి మల్లేశం, నాయకులు మల్లారం బాబు, ఓరుగంటి బాబు, కొలిపాక మధు, సలీం, నర్సింహులు, సుభాని, చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల భవన, హమాలీ, ఆటో కార్మికులు బీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించారు.

## జోరుగా బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం



ఆకునూరులో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చేర్యాల, నవంబర్ 27: మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణులు సోమవారం గడగడపకూ విస్తృతంగా ప్రచారం సాగించారు. కాంగ్రెస్ మూడు గంటల కరెంటు ఇస్తానంటున్నదని, దీంతో వ్యవసాయం ముందుకు సాగదని, తెలంగాణలో చిమ్మచీకట్లు అలుముకుంటాయని వివరించారు. అధికారం కోసం తెలంగాణ ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ గ్యారంటీల పేరుతో మ్యానిఫెస్టో రూపొందించిందని, దానిని నమ్మవద్దని కోరారు. సీఎం కేసీఆర్ పదేండ్లలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

# బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

చేర్యాల, నవంబర్ 27: మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులకు చెందిన 25 మంది మహిళలు, 50 మంది యువకులు వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందన్నారు. రెండు రోజులపాటు పా ర్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పార్టీలో చేరిన వారు కష్టపడి పని చేయాలని కోరారు. అన్ని వర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయమని, అసత్య ప్రచారాలు చేసే కాంగ్రెస్‌ను నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, రైతుబంధు రాష్ట్ర సమితి జిల్లా సభ్యుడు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి, కౌన్సిలర్లు ఆడెపు నరేందర్, పచ్చిమడ్ల సతీశ్‌గౌడ్, నాయకులు రామగల్ల బాబు, బీరెడ్డి ఇన్నారెడ్డి, బూరగోని తిరుపతిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరుతున్న మున్సిపల్ 11వ వార్డు మహిళా ప్రతినిధులు

## పల్లాకు హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ మద్దతు

కొమురవెల్లి, నవంబర్ 27: బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి రోజురోజుకు మద్దతు పెరుగుతున్నది. సోమవారం సిద్దిపేట జిల్లా హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు ఎంబీ భాస్కర్ ఆధ్వర్యంలో ఆర్గనైజేషన్ ప్రతినిధులు జనగామలో పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కలిసి మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి నవీన్, సంయుక్త కార్యదర్శి రాజు, ప్రతినిధులు బాబా, మెరుగు కిరణ్, రవి, రాజు ఉన్నారు.



పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతు తెలుపుతున్న హ్యూమాన్ రైట్స్ ఆర్గనేషన్ ప్రతినిధులు

# భక్తిశ్రద్ధలతో కార్తిక పౌర్ణమి

**కొమురవెల్లిలో కార్తిక పౌర్ణమి పూజలు**

చేర్యాల, నవంబర్ 27: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం కొమురవెల్లి మల్లికార్జున స్వామిని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కొమురవెల్లికి వచ్చిన భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో స్వామి వారి ఆలయంలో అభిషేకాలు, అర్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలువురు భక్తులు పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈవో బాలాజీ ఆధ్వర్యంలో దీపారాధన ఉత్సవంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండపంలో లింగాకారంలో దీపాలు ఏర్పాటు చేసి వెలిగించారు. చేర్యాల పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేణుగోపాల స్వామి ఆలయం, ఆకునూరులోని భవానీరుద్రేశ్వర స్వామి ఆలయంలో కార్తిక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.



దీపారాధన పూజను ప్రారంభిస్తున్న ఈవో బాలాజీ



కొమురవెల్లి మల్లన్న ఆలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు

## ఆలయాల్లో ప్రత్యేక పూజలు



మద్దూరు రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్27: కార్తిక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సామూహికంగా కార్తిక దీపాలను వెలిగించారు. మద్దూరు మండలంలోని గాగిళ్లాపూర్‌లోని కాళీమాత ఆశ్రమంలో శివ కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. మద్దూరు మండల కేంద్రంలోని రామాలయంలో అర్చకుడు పానుగంటి తిరుపతయ్య ఆధ్వర్యంలో భక్తులు అర్చన, అభిషేకాలు నిర్వహించారు.



చేర్యాల అయ్యప్ప స్వామి ఆలయంలో సామూహిక వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు